
E-KABURU E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 27-07-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




ఉపాధ్యాయుల పదోన్నతులకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా » 3లో

ఈ బుల్లి కారు.. ఇక మరింత ప్రియం » 4లో



పోరాడుతున్న భారత్.. నాలుగో రోజు ముగిసిన ఆట » 6లో



గుర్తుపట్టలేనంతగా మారిపోయిన హీరోయిన్.. ఇప్పుడేం చేస్తుందంటే? » 5లో



అంత తక్కువ వడ్డీ అంటే అనుమానించాలి కదా? » 4లో



# జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం

» చర్చ లేకుండా బిల్లు ఆమోదం పొందడంలో కీలక పాత్ర
» దేశంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేత
» 'జైపాల్‌రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



ఈ కబురు, హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన నాయకుడు మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చూపిన చొరవే కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు.

తరువాయి 2లో

## తెలంగాణలో కుమ్మక్కు రాజకీయం: కేటీఆర్

» అటు సీఎం రేవంత్ బావమరిదికి కేంద్రంలో రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు
» ఇటు కాంగ్రెస్ ప్రభుత్వంలో బీజేపీ ఎంపీకి రూ.1,660 కోట్ల కాంట్రాక్టు
» సీఎం రేవంత్, సీఎం రమేశ్ కుంభకోణాలపై ఉమ్మడిగా చర్చించేందుకు సిద్ధం
» 'ఎక్స్' వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తరువాయి 2లో

## ఆపరేషన్ సింధూర్‌తో... భారత్ బలం తెలిసింది



» తూత్తుకుడి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ ప్రారంభం

చెన్నై(ప్యారిస్), ఈ కబురు: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బలం తెలిసిందని, ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో మేక్ ఇన్ ఇండియా కీలక పాత్ర వహించిందని ప్రధాని మోదీ అన్నారు. మాల్దీవుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం రాత్రి తమిళనాడులోని తూత్తుకుడికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. తమిళుల సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన మోదీకి రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు తదితరులు స్వాగతం పలికారు. రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్‌ను మోదీ ప్రారంభించారు.

తరువాయి 2లో

## ఏఐ వినియోగంపై ఉద్యోగులకు శిక్షణ



ఈ కబురు, హైదరాబాద్: కృత్రిమ మేధ(ఏఐ) పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పరిపాలనలో దేశంలోనే మొట్టమొదట పూర్తిస్థాయిలో ఉపయోగించిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలని, అందుకు తగిన శిక్షణను ఉద్యోగులందరికీ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

» 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. నలుగురు మావోలు మృతి

ఈ కబురు: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటన స్థలం నుంచి భారీగా ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లాలోని సౌత్ వెస్ట్ రీజియన్‌లో మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.


తరువాయి 2లో




## గుజరాత్‌లో భాజపాను ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం: రాహుల్ గాంధీ

ఈ కబురు, ఆణంద్: ఎన్నికల అభ్యర్థులను ఎన్నుకునే సమయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని గుజరాత్‌లోని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

తరువాయి 2లో



## ఐరోపాను నాశనం చేస్తున్న వలసలు




» 3లో

## తెలంగాణలో కొత్త నాయకత్వం



» 3లో

## మరో తెలంగాణ ఉద్యమం తప్పదు



» ఏపీ జలదోపిడీ వయా బనకచర్ల
» బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో పీపీటీ ద్వారా వివరించిన హరీశ్‌రావు

ఈ కబురు, హైదరాబాద్/ ఉప్పల్ / కాప్రా: నీళ్ల కోసం మరో తెలంగాణ ఉద్యమం చేస్తామని..బనకచర్ల విషయంలో ఢిల్లీ మెడలు వంచుతామని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్‌లోని ఓ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. తన శిష్యుడు రేవంత్‌రెడ్డితోపాటు... ఢిల్లీ కూడా తన చేతిలో ఉందని చంద్రబాబు అనుకుంటున్నారని.. రేవంత్, ఢిల్లీ ఒప్పుకున్నా తెలంగాణ సమాజం మాత్రం బనకచర్లకు ఒప్పుకోదని హెచ్చరించారు. తెలంగాణ సమాజం మరో ఉద్యమానికి సిద్ధమవుతుందన్నారు. అవసరమైతే ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలు మళ్లీ ఉద్యమానికి వేదికలై తెలంగాణ హక్కులు కాపాడుతాయని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్‌రెడ్డి తలూపి సంతకం పెట్టినా కేసీఆర్ ఊరుకోదని, తెలంగాణ రైతులు ఊరుకునే ప్రసక్తే ఉండదన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గోదావరి జలాలపై విద్యార్థులకు హరీశ్‌రావు అవగాహన కల్పించారు. తెలంగాణ ద్రోహుల లిస్ట్ రాస్తే మొదటి పేరు చంద్రబాబు, రెండో పేరు రేవంత్ రెడ్డిదేనన్నారు.

తరువాయి 2లో



## భారత సైన్యంలో రుద్ర, భైరవ్

» శత్రువుని విస్మయపరిచే యూనిట్లకు శ్రీకారం
» సైన్యాధిపతి జనరల్ ద్వివేది వెల్లడి

ఈ కబురు,ద్రాస్: శత్రుమూకల నుంచి భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేలా, వాటిని విస్మయపరిచే దాడులు చేసేలా భారత సైన్యంలో రుద్ర, భైరవ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వద్ద ఆయన నివాళులర్పించారు. సాధారణ పౌరులు కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించేలా 'ఈ-శ్రద్ధాంజలి'తోపాటు పలు యాప్‌లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు.

తరువాయి3లో

మొదటి పేజీ తరువాయి

# జైపాల్‌రెడ్డి చొరవతోనే ప్రత్యేక రాష్ట్రం



ఈ కబురు, హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన నాయకుడు మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి అని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చూపిన చొరవే కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో పనిచేసిన జైపాల్‌రెడ్డి దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్, కేపిటల్ ఫౌండేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో.. రచయిత, ఆర్థిక నిపుణులు మోహన్ గురుస్వామికి 'ఎస్.జైపాల్‌రెడ్డి డెమొక్రసీ అవార్డు'ను ప్రదానం చేసిన అనంతరం సీఎం ప్రసంగించారు.

**తెలంగాణలో పీవీ తర్వాత జైపాల్‌రెడ్డే..**

జైపాల్‌రెడ్డి పాత్ర లేకపోతే ఇవాళ ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదని రేవంత్‌రెడ్డి చెప్పారు. చర్చ లేకుండానే పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేలా ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని, జైపాల్‌రెడ్డి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ కూడా ఒక సందర్భంలో తనతో చెప్పారని తెలిపారు. కాంగ్రెస్‌ను వీడినా, తిరిగి కాంగ్రెస్‌లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం ఆయన ఎన్నడూ పార్టీలు మారలేదని చెప్పారు. పెట్రోలియం శాఖ మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని, సమాచార శాఖ మంత్రిగా ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారని గుర్తు చేశారు. పార్లమెంటులో రాణించిన వాజ్‌పేయి మొదలుకుని అనేకమంది మేధావుల్లో ఎవరితోనూ జైపాల్‌రెడ్డికి వ్యక్తిగత వైరం లేదని, చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో పీవీ నరసింహారావు తర్వాత అంత పేరు తెచ్చుకున్న నాయకుడు జైపాల్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని, పీవీ, జైపాల్‌రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని చెప్పారు.

**ఇప్పుడంతా స్విగ్గీ పాలిటిక్స్**

పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపైనే జైపాల్‌రెడ్డి ఎక్కువ ఆలోచించేవారని, రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ప్రయత్నించారని రేవంత్ చెప్పారు. అయితే నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని, దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి మేనేజ్‌మెంట్ పాలిటిక్స్ వచ్చాయని వ్యాఖ్యానించారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని, యూనివర్సిటీల్లో విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా 'భారత్‌లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముందున్న సవాళ్లు'అనే అంశంపై రాజ్యసభ సభ్యుడు శస్మిత్ పాత్రా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ వీసీ ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేశ్, కేపిటల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రదానం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్‌తో...

## భారత్ బలం తెలిసింది



చెన్నై(ప్యారిస్), ఈ కబురు: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బలం తెలిసిందని, ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో మేక్ ఇన్ ఇండియా కీలక పాత్ర వహించిందని ప్రధాని మోదీ అన్నారు. మాల్దీవుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం రాత్రి తమిళనాడులోని తూత్తుకుడికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. తమిళుల సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన మోదీకి రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవి, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు తదితరులు స్వాగతం పలికారు. రూ.450 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తూత్తుకుడి విమానాశ్రయంలో విస్తరించిన కొత్త టెర్మినల్‌ను మోదీ ప్రారంభించారు. రాష్ట్రంలో రూ.4,900 కోట్లతో పూర్తిచేసిన వివిధ రహదారులు, రైల్వే మార్గాలను ఆయన జాతికి అంకితం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బ్రిటన్, మాల్దీవుల పర్యటనల్లో చారిత్రక ఒప్పందాలపై సంతకాలు చేసినట్లు చెప్పారు. ఆత్మవిశ్వాసంతో భారత్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమిళనాడును అభివృద్ధి చేసే పని 2014లో ప్రారంభం అయిందని, ఈ 11 ఏళ్లలో రహదారులు, ఇంధనం, విమానాశ్రయాలు సహా పలు పథకాలను పూర్తి చేసినట్లు చెప్పారు. తూత్తుకుడి విమానాశ్రయం కొత్త టెర్మినల్ ద్వారా ఏడాదికి 20 లక్షల మంది రాకపోకలు సాగించొచ్చన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. దక్షిణ తమిళనాడు ముఖద్వారంగా తూత్తుకుడి మారుతుందని, వాణిజ్యం వృద్ధి చెందుతుందని, కొత్త విమానాశ్రయాల వల్ల లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. నలుగురు మావోలు మృతి



ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటన స్థలం నుంచి భారీగా ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లాలోని సౌత్ వెస్ట్ రీజియన్‌లో మావోయిస్టుల కోసం భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి.

కాగా, జూలై 18న భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో భద్రతా బలగాలకు ఎదురుపడ్డ మావోయిస్టులు ఎదురు కాల్పులు జరపడానికి యత్నించారు. అబుజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.మావోయిస్టుల వేరివేతే లక్ష్యంగా భదత్రా బలగాలు పలు ఆపరేషన్లు చేపట్టాయి. మావోయిస్టులు లొంగిపోవడం ఒకటైతే, ఇంకోటి ఏరివేతే అనే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. తమతో చర్చలు జరపాలని మావోయిస్టులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం చర్చలకు అంగీకరించలేదు. వచ్చే మార్చి నాటికి పూర్తిగా మావోయిస్టులనే ఏరివేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా పలు ఆపరేషన్ల పేరుతో మావోయిస్టుల ఉన్న ఏరియాలను జల్లెడ పడుతున్నాయి భద్రతా బలగాలు.

మొదటి పేజీ తరువాయి

# ఏఐ వినియోగంపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి




ఈ కబురు, హైదరాబాద్: కృత్రిమ మేధ(ఏఐ) పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పరిపాలనలో దేశంలోనే మొట్టమొదట పూర్తిస్థాయిలో ఉపయోగించిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలని, అందుకు తగిన శిక్షణను ఉద్యోగులందరికీ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీఐ) పాలకమండలి ఉపకమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలసి ఆయన పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ జనరల్(డీజీ) శాంతికుమారి సంస్థ పనితీరును తొలుత వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా దీనిని అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ సంస్థ స్వయం సమృద్ధితో ఆర్థికంగా పురోగతి సాధించాలని సూచించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ పరిజ్ఞానంతో పనిచేయడం ఎలా అనే కోర్సులో శిక్షణ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. డిగ్రీ కళాశాలలు న్యాక్ గుర్తింపు పొందేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వాలని, తద్వారా కేంద్రం నుంచి నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు నాయకత్వం వహించే మహిళలకు జిల్లా, మండల స్థాయిలో రెండేసి రోజులపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇక నుంచి ప్రతి ఆరునెలలకు ఒకసారి ఈ సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు.

# మరో తెలంగాణ ఉద్యమం తప్పదు

ఈ కబురు, హైదరాబాద్/ ఉప్పల్ /కాప్రా: నీళ్ల కోసం మరో తెలంగాణ ఉద్యమం చేస్తామని..బనకచర్ల విషయంలో ఢిల్లీ మెడలు వంచుతామని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్‌లోని ఓ గార్డెన్‌లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్వీ రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ..తన శిష్యుడు రేవంత్‌రెడ్డితోపాటు...ఢిల్లీ కూడా తన చేతిలో ఉందని చంద్రబాబు అనుకుంటున్నారని..రేవంత్, ఢిల్లీ ఒప్పుకున్నా తెలంగాణ సమాజం మాత్రం బనకచర్లకు ఒప్పుకోదని హెచ్చరించారు. తెలంగాణ సమాజం మరో ఉద్యమానికి సిద్ధమవుతుందన్నారు. అవసరమైతే ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలు మళ్లీ ఉద్యమానికి వేదికలై తెలంగాణ హక్కులు కాపాడుతాయని హెచ్చరించారు. బనకచర్ల విషయంలో రేవంత్‌రెడ్డి తలూపి సంతకం పెట్టినా కేసీఆర్ ఊరుకోడని, తెలంగాణ రైతులు ఊరుకునే ప్రసక్తే ఉండదన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గోదావరి జలాలపై విద్యార్థులకు హరీశ్‌రావు అవగాహన కల్పించారు. తెలంగాణ ద్రోహుల లిస్ట్ రాస్తే మొదటి పేరు చంద్రబాబు, రెండో పేరు రేవంత్ రెడ్డిదేనన్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని, ఉద్యమ జ్ఞాపకాలను తూడిచే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టీఎస్‌ను టీజీగా మార్చడమే అందుకు నిదర్శనమన్నారు. రేపటితరం నాయకులైన విద్యార్థులే తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణపై కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఇంటి దొంగలు తెలంగాణ నీళ్లు తెలంగాణకు దక్కకుండా చేస్తున్నారని చెప్పారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ జై తెలంగాణ అనే నినాదంపై కాంగ్రెస్ ప్రభుత్వం అప్రకటిత నిషేధం కొనసాగిస్తుందని చెప్పారు.



**పెద్ద కోవర్ట్ రేవంత్ రెడ్డే: కేటీఆర్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద కోవర్ట్‌గా పనిచేస్తున్నాడని, ఏపీ సీఎం చంద్రబాబు, బీజేపీ ఆటలు తెలంగాణలో సాగవని గ్రహించి గులాబీ పార్టీ లేకుండా కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బనకచర్ల పేరిట గోదావరి జలాలను తెలంగాణకు శాశ్వతంగా దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ జల హక్కులకు పిండం పెట్టే కుట్రలను ఆపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉన్నాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు. బీఆర్ఎస్వీ ముగింపు కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. 'కేసీఆర్‌తోపాటు నన్ను, పార్టీ నేతలను ఇబ్బంది పెట్టేందుకు కాంగ్రెస్, బీజేపీ కలిసి కట్టుగా కుట్రలు, దాడి చేస్తున్నాయి.

**అధికారంలోకి వచ్చి అన్ని లెక్కలు తేలుస్తాం**

'ఫోన్ ట్యాపింగ్ తాము కూడా చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పాడు. ఆరు గ్యారంటీలు 420 హామీల అమలు గురించి ప్రజలు అడగకుండా ఉండేందుకు హీరోయిన్ల ఫోన్లు ట్యాప్ అయ్యాయని కల్పిత కథలను సృష్టించారు. విద్యార్థి నాయకుడు గెల్లు శ్రీనివాస్ భార్య మీద హత్యాయత్నం కేసు పెట్టిన పోలీసులు గడ్డి తింటున్నారా. రేవంత్‌రెడ్డి కట్టు బానిసలు లాగా పనిచేస్తున్న కొందరు పోలీసులకు మెదడు ఉందా. అక్రమ కేసులు పెడుతూ, అధికార పార్టీ నేతల అండతో చెలరేగిపోతున్న పోలీసు అధికారుల పేర్లు రాసిపెట్టుకోండి. మళ్లీ అధికారంలోకి వచ్చేది మనమే. మిత్తీతో సహా అన్ని లెక్కలు తే లుస్తాం. కేసులకు భయపడకుండా బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# తెలంగాణలో కుమ్మక్కు రాజకీయం: కేటీఆర్



దౌర్భాగ్యపు దందా మరొకటి ఉండదు. ఎక్కడా లేని ఫ్యూచర్‌సిటీ రోడ్డు కోసం రూ.1,660 కోట్ల కాంట్రాక్టు విడ్డూరం'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇద్దరూ కలిసి చేసిన దొంగతనం బయటపడటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు పనికిమాలిన కథలు చెబుతున్నారని 'ఎక్స్'వేదికగా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు దోచుకునే లుచ్చా పనికి సహకరించినందుకు ఒక రోడ్డును సృష్టించారు. నిబంధనలను అతిక్రమించి కాంట్రాక్టును అనుకున్న వారికి కట్టబెట్టడం సీఎం రేవంత్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. రూ.10 వేల కోట్ల దోపిడీకి సహకరించినందుకు సీఎం రమేశ్‌కు దక్కిన రిటర్న్ గిఫ్ట్ రూ.1660 కోట్లు. ఈ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనే పసలేని చెత్త అంశాన్ని తెరమీదకు తెస్తున్నారు. తెలంగాణ ప్రజల కోసం పుట్టి ఇక్కడి ప్రజల కోసం పోరాడే పార్టీ ఇప్పటికీ, ఎప్పటికీ ఏ పార్టీలోనూ విలీనమయ్యే ప్రసక్తే లేదని ప్రజలకు తెలుసు. ఇరకాటంలో పడిన ప్రతీసారి కాంగ్రెస్, బీజేపీ విలీనం అంటూ తెలంగాణ ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం రమేశ్, సీఎం రేవంత్ ఇద్దరూ కలిసి వస్తే రూ.10 వేల కోట్ల హెచ్‌సీయూ భూముల కుంభకోణం, రూ.1660 కోట్ల రోడ్డు కుంభకోణంపై చర్చించేందుకు సిద్ధం'అని కేటీఆర్ ప్రకటించారు.

**అదంతా అవాస్తవం: సీఎం రమేశ్**

అంతకుముందు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ అనకాపల్లిలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో తాను కుమ్మక్కై కాంట్రాక్ట్ పొందాననేది పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. అయితే, కేటీఆర్ ప్రశ్నించిన అంశాలకు సమాధానం ఇవ్వడానికి బదులుగా.. బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలకే సీఎం రమేశ్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కేటీఆర్‌కు తన సోదరితో ఉన్న ఇంటిపోరుతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం ఢిల్లీలోని తన ఇంటికి వచ్చి కేటీఆర్ మాట్లాడింది గుర్తుందా అని ప్రశ్నించారు. కావాలంటే తన ఇంటికి వచ్చిన సీసీ ఫుటేజీని మీడియాకు పంపిస్తానన్నారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి బయటపడకుండా, తన సోదరి కవితను వదిలేయడానికి ఏర్పాట్లు చేస్తే బీజేపీలోకి బీఆర్ఎస్‌ను కలపడానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ చెప్పిన మాటలు గుర్తులేవా అని నిలదీశారు.

# ఉపాధ్యాయుల పదోన్నతులకు తెలంగాణ ప్రభుత్వం పచ్చజెండా

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రానున్నాయి. దీనికి సంబంధించి రెండు రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఈమేరకు పదోన్నతి ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల మల్టీజోన్2లో మిగిలిపోయినవి, పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్ హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి వీటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యాయులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ఫైల్ క్లియర్ అయ్యింది.పదోన్నతులతో ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు. అదేవిధంగా డీఎస్సీ2012 తర్వాత పీఈటీ, భాషా పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ఇలా దాదాపు 2 వేల మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను ఆధారంగా తీసుకుని ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.




# గుజరాత్‌లో భాజపాను ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం:

ఈ కబురు, ఆణంద్: ఎన్నికల అభ్యర్థులను ఎన్నుకునే సమయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని గుజరాత్‌లోని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. 'సంగతన్ సుజన్ అభియాన్(పార్టీని బలోపేతం చేసేందుకు ప్రచారం)'లో భాగంగా శనివారం ఆణంద్‌లో జరిగిన జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం పక్షపాతం వహిస్తోందని, భాజపాకు కీలకమైన గుజరాత్‌లో ఆ పార్టీని ఓడించడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమని రాహుల్ వ్యాఖ్యానించారు. శిక్షణా అభ్యర్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు. 2027 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొన్న కాంగ్రెస్ కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షుల కోసం మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**రాజస్థాన్ పాఠశాల ఘటనలో దోషుల్ని శిక్షించాలి: కాంగ్రెస్**

రాజస్థాన్‌లోని ఝూలావాడ్‌లో ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు కూలి ఏడుగురు పిల్లలు మరణించిన ఘటనపై కాంగ్రెస్ భాజపాను తీవ్రంగా విమర్శించింది. దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ''మీడియా నివేదికల ప్రకారం.. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం గురించి వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా అమాయక పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువగా బహుజన్ సమాజ్‌కు చెందినవారు. వీరి ప్రాణాలంటే భాజపా ప్రభుత్వానికి విలువ లేదా?'' అని రాహుల్ శనివారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ''మన పిల్లల పాఠశాలల పై కప్పులు మరమ్మతులు చేయించలేని ప్రభుత్వం, 'వికసిత్ భారత్' గురించి పెద్ద కలలను చూపిస్తోంది. అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే.. భాజపా దేశాన్ని నాశనం చేసింది. రైలు ప్రమాదాలు, వంతెనలు కూలిపోవడం, కొత్తగా నిర్మించిన రోడ్లలో పగుళ్లు ఇవన్నీ సర్వసాధారణమైపోయాయి. భాజపా దృష్టి కేవలం అధికార దాహంపైనే కేంద్రీకృతమై ఉంది'' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు.



# టీఎన్జీవో కాలనీలో హోషినో ఎలివేటర్లు, ఎస్కలేటర్ల కార్యాలయం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి


హోషినో నిర్వాహకులతో గచ్చిబౌలి కార్పొరేటర్

**ప్రారంభించిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టిఎన్జీవోస్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హోషినో ఎలివేటర్లు, ఎస్కలేటర్లు కార్యాలయాన్ని శనివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నూతన వ్యాపార రంగంలో అడుగు పెట్టిన రాజ్ కుమార్ వ్యాపారం అందరి మన్ననలు పొందుతూ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇలాంటి చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు అభివృద్ధి చెందడం వల్ల, స్థానిక ప్రజలకు సేవలతో పాటు ఆర్థికంగా మద్దతు లభిస్తుందని అన్నారు. ప్రైవేట్ రంగం యువతకు ఉపాధి కల్పించడానికి ముందుకు రావడం హర్షణీయమని అభిప్రాయపడ్డారు. వ్యాపార రంగంలో యువత పోటీగా ముందుకు రావాలని, ప్రభుత్వ సహకారం కూడా వారి పట్ల ఉండేలా తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగ అవకాశాల కోసం పోటీ పడకుండా వ్యాపారా రంగంపై దృష్టి సారించాలని, తద్వారా మరో నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్స్ వర్గీస్, కృప రక్షణ, ప్రేమ కుమార్ , సీనియర్ నాయకులు రాజేందర్, గోపి, శేఖర్, రంగస్వామి, సుమన్, ప్రసాద్, నగేష్, బాబు, రామకృష్ణ, కాలనీ వాసులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# 'ఎక్కడ చూసినా కరప్షన్..పొల్యూషన్..' అంటూ నోట్ రాసి..


ఆత్మహత్య చేసుకున్న వేణుగోపాల్ (ఫైల్)

జీవితంపై విరక్తితో యువకుడి ఆత్మహత్య

ఈకబురు, శేరిలింగంపల్లి : ' ఎక్కడ చూసినా కరప్షన్.. ఎక్కడ చూసినా పొల్యూషన్.. ఈ జీవితంపై విరక్తి కలుగుతుంది. గతంలోనే ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నా.. అమ్మ, నాన్న నన్ను క్షమించండి.. అంటూ ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈస్ట్ గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిధిలోని మొరంపూడికి చెందిన గుట్టల సత్యనారాయణకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు దిలీప్ నాగేంద్ర, అతని భార్యతో కలిసి మణికొండ శిరిడి సాయి నగర్ లో నివాసం ఉంటున్నాడు. దిలీప్ నాగేంద్ర తమ్ముడు గుట్టల వేణుగోపాల్(26) సైతం వీరితో పాటే ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వేణుగోపాల్ ఈనెల 23వ తేదీన తన అన్న, వదినలతో కలిసి తన సొంత గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. కాగా వేణుగోపాల్ అదే రోజు తిరిగి హైదరాబాదుకు రాగా, అన్నా, వదినలు అక్కడే ఉన్నారు. 24వ తేదీన కుటుంబ సభ్యులతో మంచిగానే మాట్లాడిన వేణుగోపాల్ 25వ తేదీన ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు వీరి పక్క గదిలో ఉండే వాచ్ మెన్ సాయిబాబాకు ఫోన్ చేసి తమ ఇంట్లో చూడాలని చెప్పారు. సాయిబాబా వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు బెడ్ షీట్ తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న వేణుగోపాల్ నిర్జీవంగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కాగా గదిలో వేణుగోపాల్ రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాను ప్రేమ, మరే కారణం చేతనో ఆత్మహత్య చేసుకోవడం లేదని..సమాజంలో ఎక్కడ చూసినా అవినీతి, కాలుష్యంతో జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి పెట్టాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మొదటి పేజీ తరువాయి

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సంఘీభావం తెలిపిన సాయిబాబా

**కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసులు ప్రభుత్వ కక్ష సాధింపు చర్య : మాజీ కార్పొరేటర్ సాయిబాబా**


మ్మెల్యే కౌశిక్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులతో కలిసి చర్చిస్తున్న సాయిబాబా


మ్మెల్యే కౌశిక్ రెడ్డి, టిఆర్ఎస్ నాయకులతో కలిసి చర్చిస్తున్న సాయిబాబా

ఈకబురు, శేరిలింగంపల్లి : బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్ లోని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నివాసానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పార్టీ శ్రేణులతో కలిసిన సాయిబాబా తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమన్నారు. అనవసరంగా ఉద్రిక్త వాతావరణం సృష్టించే ప్రయత్నం చేయరాదని ఆయన ప్రభుత్వానికి సూచించారు. రాజకీయంగా చేసే విమర్శలను రాజకీయంగానే ఖండించాలని, ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు జవాబు చెప్పకుండా దాడులకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసం అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడుల పేరుతో ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య అని అన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు నమోదు చేసి వేధించాలని చూస్తే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అధిష్టానం అండగా ఉంటుందని తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగిపోయారని, మరోసారి రాష్ట్ర ప్రజలు కేసిఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబాతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ వికేంద్రీకరణకు కృషి చేస్తున్నా


భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి. ఆర్.గవాయ్

**ఈ కబురు,అమరావతి (మహారాష్ట్ర): న్యాయాన్ని ప్రజల ముంగిటకు చేర్చాలంటే న్యాయ వ్యవస్థను వికేంద్రీకరించక తప్పదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ స్పష్టం చేశారు. న్యాయ మౌలిక సదుపాయాల కమిటీ అధిపతిగా తాను కొత్త తాలూకా, జిల్లా స్థాయి కోర్టుల ఏర్పాటుకు ఒక నమూనా సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనపై పని జరుగుతోందిగానీ ఎప్పటిలాగే అధికారిక జాప్యం తప్పడం లేదని వ్యాఖ్యానించారు. శనివారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లా సెషన్స్ కోర్టులో దివంగత టి.ఆర్. గిల్డా స్మారక ఈ-లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.**

**రిటైరయ్యాక మధ్యవర్తిత్వ, న్యాయ సలహా సేవలు అందిస్తానని, ప్రభుత్వ పదవిని స్వీకరించబోనని పునరుద్ఘాటించారు. 'గతంలో నేనీ విషయాన్ని అనేక సార్లు ప్రకటించా. రానున్న నవంబరు 23 తరువాత నేను ఎలాంటి ప్రభుత్వ పదవినీ స్వీకరించబోను. మధ్యవర్తిత్వ, న్యాయ సలహా సేవలకు అంకితమవుతా' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామం దారాపుర్‌ను సందర్శించిన సీజేఐ.. తన తండ్రి, మాజీ గవర్నర్ ఆర్.ఎస్. గవాయ్‌కి నివాళులర్పించారు. దాదాసాహెబ్ గవాయ్‌గా ప్రసిద్ధుడైన తన తండ్రి పేర ఆయన గ్రామ ప్రవేశ ద్వార నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.**

# భారత సైన్యంలో రుద్ర, భైరవ్





ఈ కబురు,ద్రాస్: శత్రుమూకల నుంచి భవిష్యత్తులో ఎదురయ్యే ముప్పును ఎదుర్కొనేలా, వాటిని విస్మయపరిచే దాడులు చేసేలా భారత సైన్యంలో రుద్ర, భైరవ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వద్ద ఆయన నివాళులర్పించారు. సాధారణ పౌరులు కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించేలా 'ఈశ్రద్ధాంజలి'తోపాటు పలు యాప్‌లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు.'రుద్ర.. ఆల్ ఆఫ్ బ్రిగేడ్‌కు శుక్రవారం నేను ఆమోదం తెలిపా. దీని కింద పదాతి, యాంత్రిక దళాలతో పాటు ట్యాంకు యూనిట్లు, శతఘ్నులు, ప్రత్యేక బలగాలు, మానవ రహిత వైమానిక యూనిట్లు ఒకే చోట ఉంటాయి. ఫలితంగా రవాణా, పోరాట మద్దతుకు ఉపయుక్తంగా ఉంటాయి. దీంతోపాటు ప్రత్యేక దాడుల దళం.. భైరవ్ లైట్ కమాండో యూనిట్‌ను ఏర్పాటు చేశాం. ఇది సరిహద్దుల్లో శత్రువును విస్మయపరిచే దాడులు చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అని ద్వివేది వివరించారు. ప్రతి పదాతి దళ బెటాలియన్‌కు ఒక డ్రోన్ ప్లటూన్ ఉందని, శతఘ్ని దళంలో శక్తిబన్ రెజిమెంట్‌ను ఏర్పాటు చేశామని, ఇందులో డ్రోన్, డ్రోన్ విధ్వంసక, గాలిలో ఎక్కువసేపు సంచరించగలిగే ఆయుధ వ్యవస్థలు ఉన్నాయని తెలిపారు.

# ఐరోపాను నాశనం చేస్తున్న వలసలు

ఈ కబురు, ఎడిన్‌బరో: ఐరోపాను వలసల ప్రవాహం నాశనం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. వ్యవస్థను సరిచేసుకోకపోతే ఇక ఐరోపా మిగలదని అన్నారు. వలసలను 'భయంకరమైన దండయాత్ర'గా అభివర్ణించారు. శనివారం స్కాట్లాండ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రంప్ తండ్రి ఫ్రెడ్ ట్రంప్, తల్లి మేరీ ఆన్ మెక్‌లియోడ్ ఇద్దరూ యూరప్ నుంచే అమెరికాకు వలస రావడం గమనార్హం! యూరప్ పర్యటన సందర్భంగా బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయన్‌లతో ట్రంప్ సమావేశం కానున్నారు.

పర్యటన ఖర్చుపై వివాదం

ట్రంప్, ఆయన తనయుడు ఎరిక్ కలిసి స్కాట్లాండ్‌లో టర్న్‌బెర్రీ సమీపంలో చరిత్రాత్మక గోల్ఫ్‌క్లబ్‌లో గోల్ఫ్ ఆడారు. వారి కుటుంబం 2008లో దీనిని సొంతం చేసుకుంది. బ్రిటన్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఒకపక్క వందలమంది నిరసనకారులు ఎడిన్‌బరోలోని అమెరికా కాన్సులేట్ ఎదుట ప్రదర్శనలు కొనసాగిస్తుండగా మరోపక్క ఆయన గోల్ఫ్ ఆడారు. సొంత గోల్ఫ్ రిసార్టుల ప్రచారం కోసమే ట్రంప్ ఈ పర్యటన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఐదు రోజుల పర్యటన కోసం లక్షల డాలర్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఆయన ఉపయోగించే 'ఎయిర్‌ఫోర్స్ వన్' విమాన ప్రయాణానికి గంటకు 2,73,063 డాలర్లు (సుమారు రూ.2.3కోట్లు) ఖర్చు అవుతుంది. వాస్తవానికి ట్రంప్ బ్రిటన్ పర్యటన సెప్టెంబరులో జరగాలి. సొంత గోల్ఫ్ క్లబ్బుల మార్కెటింగ్ కోసం అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారని శ్వేతసౌధం మాజీ ఉద్యోగి, న్యాయవాది రిచర్డ్ పెయింటర్ మండిపడ్డారు. మొత్తంగా స్కాట్లాండ్ పర్యటనకు 38 లక్షల డాలర్లు ఖర్చు కానున్నట్లు ఓ పత్రిక కథనం అంచనా వేసింది.

# తెలంగాణలో కొత్త నాయకత్వం




ఈ కబురు, హైదరాబాద్/కుత్బుల్లాపూర్: తెలంగాణలో చురుకైన కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దుతామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. కొత్త పంథాలో వెళ్తేనే సంస్థలకు మనుగడ ఉంటుందని, కాలానుగుణంగా తెలంగాణ జాగృతి కూడా తన పంథాను మార్చుకుంటుందని అన్నారు. జాగృతి ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'లీడర్'రాజకీయ శిక్షణ కార్యక్రమాన్ని కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లీడర్ అంటే కేవలం సర్పంచ్, ఎమ్మెల్యే, ఎంపీ, ముఖ్యమంత్రి పదవులు పొందడమే కాదన్నారు. లీడర్ ఆకాశం నుంచి ఊడిపడరని, ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరని కవిత పేర్కొన్నారు. నేర్చుకుంటూ, తనను తాను మార్చుకుంటూ ముందుకెళ్లేవారే నాయకులు అవుతారన్నారు. మూస పద్ధతిలో కొనసాగేవాడు ఎప్పుడూ నాయకుడు కాదని అన్నారు. తోటివారి గోప్యత, మర్యాదను కాపాడకుండా నోటికి వచ్చింది మాట్లాడటమే ఇప్పుడు ట్రెండ్‌గా మారిపోయిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలనేదే జాగృతి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆగస్టు నుంచి అన్ని జిల్లాల్లో లీడర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వెల్లడించారు.

తెలంగాణ జాతికి ఉన్న అద్భుతమైన సాంస్కృతిక నేపథ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా తెలంగాణ జాగృతి పనిచేస్తుందన్నారు. తెలంగాణకు నష్టం జరుగుతుంటే జాగృతి ఊరుకోబోదని, తెలంగాణకు నష్టం చేసే బనకచర్ల ప్రాజెక్టును ఆపి తీరుతామని కవిత స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లోని 150 డివిజన్లలో తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తామని కవిత ప్రకటించారు.

# మందకృష్ణ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాకారం

ఈ కబురు,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాల కిందట మారుమూల గ్రామంలో ఉదయించిన పోరాటం తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ పాకడంతో ఎస్సీ వర్గీకరణ కల సాకారమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. భాజపా కూకట్‌పల్లి ఇన్‌ఛార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో శనివారం న్యూబోయిన్‌పల్లిలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల 'అలయ్‌బలయ్' కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ''నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చ జరిగేది. మందకృష్ణ చేస్తున్న పోరాటాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లా. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 'విశ్వరూప మహాసభ'కు ప్రధాని మోదీ హాజరైన సందర్భంలో 'మీ ఉద్యమంలో నేనూ ఒక కార్యకర్తను అవుతాను' అని ఆయన హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించారు'' అని పేర్కొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. మందకృష్ణను ప్రధాని మోదీ అక్కున చేర్చుకున్నారని గుర్తుచేశారు. వర్గీకరణ పోరాటం ముగియడంతో ఇప్పుడు దివ్యాంగులకు పింఛన్ల అమలు కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టి అలుపెరగని పోరాటయోధుడిగా నిలిచారని అభినందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ఈటల, భాజపా నేతలు, కవులు, కళాకారులు మందకృష్ణ మాదిగను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద తదితరులు పాల్గొన్నారు.

భారత్‌లో యూపీఐ డిజిటల్ విప్లవం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో యూపీఐ ద్వారా భారత్ డిజిటల్ విప్లవం సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 'ఎక్స్'లో ఈ మేరకు పోస్టు చేశారు. భారత్ ఆర్థిక స్వావలంబన సాధించిందని, ఈ ఏడాది జూన్‌లో 1,839 కోట్ల యూపీఐ లావాదేవీల ద్వారా రూ.24 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయని వెల్లడించారు. దేశంలో దాదాపు 85 శాతం డిజిటల్ చెల్లింపులకు యూపీఐ ఆధారమన్నారు. రోజూ జరిగే 64 కోట్లకు పైగా లావాదేవీల్లో 'వీసా' కంటే యూపీఐ ముందంజలో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.





# టెక్నాలజీ అందుబాటులోకి తీసురావడమే లక్ష్యం

రిలయన్స్ రిటైల్ ఇటీవల ఎలక్ట్రోలక్స్ గ్రూప్ కన్జూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ కెల్వినేటర్ కొనుగోలు డీల్‌పై కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ స్పందించారు. కంపెనీ ఉత్పత్తుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి వినియోగదారుడి విభిన్న అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

'కెల్వినేటర్ కొనుగోలు కంపెనీ అభివృద్ధికి ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది భారతీయ వినియోగదారులకు నమ్మకమైన ప్రపంచ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడానికి వీలు కల్పిస్తుంది. దానికి కంపెనీ మార్కెట్ లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎంతో తోడ్పడుతుంది' అని ఇషా చెప్పారు.
ఈ డీల్ విలువ సుమారు రూ.160 కోట్లు. దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రీమియం గృహోపకరణాల విభాగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌కి ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ రిటైల్ గతంలో కెల్వినేటర్ బ్రాండ్‌కి లైసెన్సు తీసుకుని, ఉపయోగించుకుంది. దీని కింద ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషిన్లు మొదలైనవి అమ్ముడవుతున్నాయి.

# ఈ బుల్లి కారు.. ఇక మరింత ప్రియం



బుల్లి ఎలక్ట్రిక్ కారు 'ఎంజీ కామెట్ ఈవీ' ధరలను ఎంజీ మోటార్ మరోసారి పెంచింది. ఈ ఏడాదిలో మైక్రో ఎలక్ట్రిక్ హ్యాచ్ కారు ధరల సవరణ ఇది మూడోసారి. తాజా అప్‌డేట్‌లో రూ.15,000 వరకు పెరగడంతో, కామెట్ ఈవీ ధరలు ఇప్పుడు రూ .7.50 లక్షలు (ఎక్స్‌షోరూమ్, బ్యాటరీ కలిపి) నుండి ప్రారంభమవుతాయి. బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ (బీఏఎస్) మోడల్ కింద కామెట్ ఈవీ ధర రూ.4.99 లక్షల (ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది.

**బ్యాటరీ అద్దెలూ పెంపు**
బీఏఎస్ మాడ్యూల్ ప్రకారం బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ ధరలను కిలోమీటరుకు రూ.2.9 నుంచి రూ.3.1కి పెంచారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సమయంలో కామెట్ ఈవీ బ్యాటరీ అద్దె కిలోమీటరుకు రూ.2.50గా ఉండేది. కామెట్ ఈవీ ఎగ్జిక్యూటివ్, ఎక్సైట్, ఎక్స్ క్లూజివ్, బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుంది.

**ఎంజీ కామెట్ ఈవీ ఫీచర్లు.. స్పెసిఫికేషన్లు**
ధర పెరగడం మినహా కామెట్ ఈవీలో ఇతర మార్పులేమీ లేవు. ఫీచర్ల విషయానికి వస్తే, కామెట్ ఈవీ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో డ్యూయల్ 10.25అంగుళాల స్క్రీన్లను కలిగి ఉంది. వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే, మాన్యువల్ ఏసీ, ఎలక్ట్రికల్ ఫోల్డబుల్ అవుట్‌సైడ్ రియర్ వ్యూ మిర్రర్స్, కీలెస్ ఎంట్రీ, పవర్ విండోస్, 4స్పీకర్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి.డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ), నాలుగు డిస్క్ బ్రేకులు, హిల్ హోల్డ్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా, సెన్సార్లు, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి.

కోమెట్ ఈవీలో 17.4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఉంది. ఇది వెనుక యాక్సిల్‌పై అమర్చిన ఎలక్ట్రిక్ మోటారుకు శక్తిని అందిస్తుంది. ఇది 41 బిహెచ్‌పీ, 110 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 230 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. గరిష్ట వేగం గంటకు 85 కిలోమీటర్లు. 7.4 కిలోవాట్, 3.3 కిలోవాట్ల ఛార్జర్లతో 0 నుండి 100 శాతం ఛార్జ్ సమయం వరుసగా 3.5 గంటలు, ఏడు గంటలు పడుతుంది.

# అమెరికన్ల చేతిలో మన ఫోన్లు..
# చైనా ఆధిపత్యానికి గండి!

స్మార్ట్‌ఫోన్ల తయారీలో భారత్ దూసుకెళుతోంది. పీఎల్ఐ స్కీమ్ కారణంగా దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ నేడు మేడిన్ ఇండియా ఫోన్లు పెద్దఎత్తున దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఐదు నెలల కాలానికి ఆ దేశ స్మార్ట్‌ఫోన్ల దిగుమతుల్లో మన వాటా 36 శాతానికి చేరింది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరి వద్ద దేశీయంగా తయారైన ఫోన్లు ఉంటున్నాయన్నమాట. గతేడాది ఈ వాటా 11 శాతంగా ఉంది. అదే సమయంలో 82 శాతంగా ఉన్న చైనా మార్కెట్ వాటా 49 శాతానికి తగ్గింది. ఆ మేర డ్రాగన్ ఆధిపత్యానికి గండి పడింది.

అమెరికా ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి మే నెల మధ్య కాలంలో 21.3 మిలియన్ యూనిట్ల స్మార్ట్‌ఫోన్లను భారత్ అమెరికాకు ఎగుమతి చేసింది. 9.35 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను అగ్రరాజ్యానికి భారత్ ఎగుమతి చేసింది. మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల్లో విలువ పరంగా స్మార్ట్‌ఫోన్లదే అగ్రస్థానం కావడం విశేషం.

చైనాకు చెక్: అమెరికాకు ఇప్పటికీ అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నది చైనానే అయినప్పటికీ.. ఆ దేశ దిగుమతులు క్రమంగా క్షీణిస్తున్నాయి.



ఈ ఏడాది జనవరి మే మధ్య 29.4 మిలియన్ యూనిట్లను ఆ దేశం అమెరికాకు ఎగుమతి చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 27 శాతం తగ్గడం గమనార్హం. మొత్తంగా 10 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ప్రస్తుతం చైనా 49 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా.. భారత్ 36 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. వియత్నాం 14 శాతం మార్కెట్ వాటాతో మూడో స్థానంలో నిలిచింది.

అమెరికాకు ఎగుమతి అవుతున్న స్మార్ట్‌ఫోన్లలో అత్యధికం యాపిల్‌వే. 2020 వరకు స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి విషయంలో చైనా పైనే అధికంగా ఆధారపడిన యాపిల్.. ఆ తర్వాత తన పంథాను మార్చుకుంది. భారత్ తయారీని ప్రారంభించింది. ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. తొలుత కేవలం పాత మోడళ్లు మాత్రమే ఉత్పత్తి చేసే యాపిల్.. ఇప్పుడు ప్రో మోడళ్ల తయారీనీ దేశంలోనే చేపడుతోంది.

ట్రంప్ వద్దన్నా: భారత్‌లో యాపిల్ ఫోన్ల తయారీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబడుతున్నారు. ఐఫోన్లను అమెరికాలోనే తయారుచేయాలని, లేదంటే 25 శాతం సుంకం విధిస్తానని అప్పట్లో యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌ను ట్రంప్ ఓవిధంగా బెదిరించారు. అయినప్పటికీ.. యాపిల్ మాత్రం దేశీయంగా తయారీకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ ఇప్పటికే దేశీయంగా ఐఫోన్లను తయారు చేస్తుండగా.. తమిళనాడులో ప్లాంట్ ఏర్పాటుకు మరో 1.49 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఫాక్స్‌కాన్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి ఈ ఏడాది మేలో తెలియజేసింది. తన కాంట్రాక్ట్ మానుఫ్యాక్చరర్ల ద్వారా ఇండియాలో తయారీకే యాపిల్ ఇప్పటికీ జైకొడుతోంది.

# 'నచ్చిన దేశం వస్తువును ఎంచుకునేలా!'..
# ఇ-కామర్స్‌లో కొత్త ప్రతిపాదన

**ఆన్‌లైన్ షాపింగ్‌కు ఉన్న ఆదరణ తెలియనిదికాదు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆయా ఇ-కామర్స్ ప్లాట్‌ఫాంలు భారీ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. అదేవిధంగా వస్తువుల ఎంపికను మరింత సులభతరం చేసేందుకు ధర, బ్రాండ్, రంగు.. ఇలా అనేక ఫిల్టర్లు అందుబాటులో ఉంచుతాయి. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా సరికొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. నచ్చిన దేశానికి చెందిన ఉత్పత్తిని ఎంచుకునేలా.. 'కంట్రీ ఆఫ్ ఆరిజిన్ (వస్తువు ఏ దేశంలో తయారైంది)' అనే ఫిల్టర్‌నూ జతచేయాలని ఇ-కామర్స్ సంస్థలకు సూచించినట్లు సమాచారం. రానున్న పండగల సీజన్ షాపింగ్ రద్దీకి ముందే దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా సన్నాహాలు చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.**

వినియోగదారుల వ్యవహారాలశాఖ ఇటీవల ఇకామర్స్ సంస్థలు, సంబంధిత వర్గాలతో వర్చువల్ సంప్రదింపులు నిర్వహించింది. ఈ సందర్భంగా..




సంబంధిత ఫిల్టర్‌ను ప్రవేశపెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు సమాచారం. "అనేక ఇకామర్స్ ప్లాట్‌ఫాంలలో ఇప్పటికే ధర పరిధి, బ్రాండ్ వంటి ఫిల్టర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'ఏ దేశంలో ఉత్పత్తి అయ్యింది' అనే ఫిల్టర్‌నూ జతచేయడం సాధ్యమే. వినియోగదారులు తమ ప్రాధాన్యం ఆధారంగా వస్తువులను మరింత త్వరగా వెతుక్కోవడంలో ఇది సాయపడుతుంది. అదేవిధంగా నచ్చిన ఉత్పత్తి కొనుగోలు చేశామనే తృప్తిని మిగుల్చుతుంది" అని అధికారులు తెలిపారు.

ఈ ప్రతిపాదనను ఆచరణలోకి తీసుకురావడంపై సంస్థల మధ్య విస్తృత ఏకాభిప్రాయం కుదిరినట్లు అధికారులు చెప్పారు. అల్గారిథంలలో మార్పులు, మొబైల్ యూఐ పరిమితులు వంటి సాంకేతిక సవాళ్లనూ ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనపై మరిన్ని చర్చలు నిర్వహిస్తామన్నారు. ఈ కొత్త ఫీచర్ ఇకామర్స్ ప్లాట్‌ఫాంలకు ఒక సాంకేతిక సమస్య మాత్రమేనని, కానీ.. వస్తువులను నిల్వ చేసే కంపెనీలకు భారంగా మారొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. మొబైల్ యాప్‌లలో స్క్రీన్ స్థలం ఇప్పటికే తక్కువగా ఉందని దీంతో స్క్రాలింగ్ పెరుగుతందని ఒక ప్రముఖ ప్లాట్‌ఫాం ప్రతినిధి ప్రస్తావించినట్లు సమాచారం.*

# అంత తక్కువ వడ్డీ అంటే
# అనుమానించాలి కదా?

**హైదరాబాద్ నగర శివార్లలోని తెల్లాపూర్‌లో ఉంటున్న ఓ వ్యక్తి తాను ముంబైలో ఉంటున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం చేసుకున్నాడు. ఫిన్‌పెయిర్ పేరుతో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వ్యాపారాభివృద్ధికి రుణం ఇస్తానంటూ ఎర వేశాడు. నమ్మి ముందుకు వచ్చిన నగర వ్యాపారి నుంచి రూ.1.5 కోట్లు స్వాహా చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడు డి.నాగరాజును అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత శుక్రవారం వెల్లడించారు.**

తెల్లాపూర్ రోడ్డులోని హోనర్ వివాంటీస్‌లో నివసించే నాగరాజు ఆన్‌లైన్‌లో ఫిన్ పెయిర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. దీనికోసం ఓ వెబ్‌సైట్‌ను రూపొందించిన ఇతగాడు అందులో ఇది ముంబై కేంద్రంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వివిధ రకాలైన వ్యాపారులను వారి వ్యాపారాభివృద్ధి కోసం తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ ఆన్‌లైన్ వేదికగా ప్రచారం చేశాడు.

నగరానికి చెందిన ఓ వ్యాపారి (39) ఆన్‌లైన్‌లో వచ్చిన ఈ ప్రకటన చూసి ఆకర్షితుడయ్యాడు. తనకు రుణం కావాలంటూ ఆ ప్రకటనలో పొందపరచగా... అది చూసిన నాగరాజు 2023 జూన్‌లో సదరు వ్యాపారిని సంప్రదించాడు. వ్యాపారి పూర్వాపరాలు, రుణం అవసరాలను తెలుసుకున్న నాగరాజు భారీ మొత్తం తక్కువ వడ్డీకి ఇవ్వడానికి అంగీకరించాడు.



ఆపై వివిధ రకాలైన రుసుముల పేరు చెప్పి ఆ ఏడాది నవంబర్ నుంచి దశల వారీగా రూ. కోటీ 55 లక్షలు స్వాహా చేశాడు.

అప్పటి నుంచి త్వరలో రుణం మంజూరై ఖాతాలో పడుతుందంటూ నమ్మబలుకుతున్నాడు. ఎట్టకేలకు మోసపోయానని తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని అరెస్టు చేసింది. ఇతడు ఇలాంటి నేరాలు ఇంకా ఏవైనా చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తోంది.

# ఐటీకి ముందుంది మంచి కాలం

కొన్ని నెలలుగా ఐటీ పరిశ్రమలో చెప్పుకోదగిన లాభాలు ఉండడంలేదు. ప్రస్తుత త్రైమాసికంలో కంపెనీలు పోస్ట్ చేస్తోన్న ఫలితాల్లో చాలాభాగం లేఆఫ్స్, డిస్క్రీషనరీ వ్యయాన్ని తగ్గించుకోవడం వల్ల ఒనగూరిందే. అయితే సమీప భవిష్యత్తులో వీటిలో మార్పు రాబోతుందని అంచనాలు వెలువడుతున్నాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా ఆధునీకరణ, మెరుగైన డిజిటల్ అనుభవాల కోసం ఐటీ కంపెనీల కస్టమర్లు వ్యయాన్ని పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా, రిటైల్ రంగాల్లో విచక్షణాత్మక ఐటీ వ్యయం తిరిగి గాడినపడుతుందనే సంకేతాలు వస్తున్నాయి.



**వ్యయాలు పెంపు**
స్థూల ఆర్థిక ఒడిదుడుకులు, అంతర్జాతీయ టారిఫ్ అనిశ్చితుల మధ్య మొత్తం టెక్ బడ్జెట్లు స్తంభించాయి. సాంప్రదాయ ఐటీ కార్యకలాపాలను కంపెనీలు జాగ్రత్తగా నిర్వహిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈమేరకు ఐటీ కస్టమర్ కంపెనీలు తమ వ్యయాన్ని పెంచుతున్నాయి. ఇది ఐటీ రంగానికి కలిసొచ్చే అంశం. వినియోగదారులు ఏఐ వాడకంవైపు మొగ్గు చూపడం కూడా ఐటీకి ఊతం ఇస్తుంది. జేపీ మోర్గాన్ చేజ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి ప్రధాన యూఎస్ బ్యాంకులు ఏఐకి సంబంధించి ప్రయోగాత్మక దశలను దాటి పూర్తి స్థాయి, ఉత్పత్తి గ్రేడ్ ఏఐను వాడుతున్నాయి. ఈ పరివర్తన వ్యాపార ఫలితాలకు నేరుగా దోహదం చేస్తుంది.

**ఏఐతో మేలు..**
మల్టీ బిలియన్ డాలర్ల టెక్ బడ్జెట్ ఉన్న సంస్థలు ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గణనీయమైన వార్షిక ఆదాయాన్ని సంపాదిస్తున్నట్లు ఫారెస్టర్ ప్రిన్సిపల్ అనలిస్ట్ బిశ్వజీత్ మహాపాత్ర అన్నారు. స్పష్టమైన ఉత్పాదకత లాభాల కోసం ఏఐ ఎంతో ఉపయోగపడుతోందని చెప్పారు. హైపర్‌పర్సనలైజేషన్‌తో మెరుగైన కస్టమర్ అనుభవం చేకూరుతుందని చెప్పారు. ఏజెంట్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కార్యకలాపాలను క్రమబద్ధీకరించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇది ఐటీ కంపెనీలకు లాభాలు తెస్తుందని చెప్పారు. ప్రముఖ సంస్థల ఐటీ వ్యయంలో 50% కంటే ఎక్కువ కృత్రిమ మేధ, డేటా ఆధునీకరణ, కస్టమర్‌ఫేసింగ్ ఇన్నోవేషన్ వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు.

**పూర్తి స్థాయిలో కేటాయింపులు పెండింగ్..**
ఐటీ కంపెనీల కస్టమర్ సంస్థల విచక్షణ వ్యయంలో రికవరీ ఇంకా విస్తృతంగా లేదని నిపుణులు చెబుతున్నారు. అనేక సంస్థలు ఐటీ స్పెండింగ్ కోసం ఇంకా పూర్తి స్థాయిలో కేటాయింపులు జరపడంలేదు. దాంతో మొత్తం టెక్ బడ్జెట్లు 2026 ఆర్థిక సంవత్సరంలో ఫ్లాట్‌గా లేదా స్వల్ప లాభాల్లో మాత్రమే పెరుగుతాయని కొందరు భావిస్తున్నారు. ఏదేమైనా ఏఐ పుణ్యామా అని ఐటీ వ్యయంలో కొంత పురోగతి ప్రారంభమవుతున్నట్లు తెలుస్తుంది.




# ఘనంగా 'కింగ్‌డమ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక
## ట్రైలర్ తో 'కింగ్‌డమ్'పై అంచనాలు తారాస్థాయికి

**వెంకన్న స్వామి దయ, ప్రేక్షకుల ఆశీస్సులతో 'కింగ్‌డమ్' చిత్రంతో ఘన విజయం సాధిస్తాను : కథానాయకుడు విజయ్ దేవరకొండ**

తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో 'కింగ్‌డమ్' ఒకటి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. జూలై 31న ప్రేక్షకుల ముందుకు రానున్న 'కింగ్‌డమ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది.

శనివారం(జూలై 26) సాయంత్రం తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్స్ లో 'కింగ్‌డమ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. విజయ్ దేవరకొండ ఖాతాలో మరో ఘన విజయం చేరనుందనే భరోసాను ఈ ట్రైలర్ ఇస్తోంది.



# ఆ స్పెషల్ టాటూ ఇంకా పదిలంగానే..

**హీరోయిన్‌గా సమంత వెండితెరకు పరిచయమైన చిత్రం ఏమాయ చేసావె. నాగచైతన్య హీరోగా నటించాడు. 2010లో వచ్చిన ఈ ప్రేమకథాచిత్రంతోనే వీరి లవ్‌కు పునాది పడింది. తొలి చిత్రమే బ్లాక్‌బస్టర్ కావడంతో సామ్‌కు బోలెడంత గుర్తింపు వచ్చింది. అందుకే ఈ స్పెషల్ చిత్రానికి గుర్తుగా సామ్.. (ఏ మాయ చేసావే) టాటూను మెడపై వేయించుకుంది. ఈ పచ్చబొట్టు తనకెంతో స్పెషల్ అని చాలా ఇంటర్వ్యూలలో చెప్పింది.**

**పచ్చబొట్టు మాయం?**

ఇదే కాదు. చై ప్రేమకు గుర్తుగా కూడా ఓ పచ్చబొట్టు వేయించుకుంది. కానీ వీరిద్దరూ విడాకులు తీసుకున్న తర్వాత ఆ టూటూ తొలగించుకుంది. ఇటీవల ఓ వీడియో పచ్చబొట్టు కనిపించకపోవడంతో ఆ గుర్తును కూడా పూర్తిగా చెరిపేసుకుందని అంతా అనుకున్నారు. కానీ, తాజాగా సామ్ పోస్ట్ చేసిన ఫోటోల్లో ఆ పేరు అలాగే చెక్కుచెదరకుండా ఉంది.

**విడాకులు**

నాగచైతన్యసమంత 2017లో పెళ్లి చేసుకున్నారు. చూడముచ్చటగా ఉండే ఈ జంట 2021లో విడాకులు తీసుకుంది. చై.. తెలుగమ్మాయి శోభిత ధూళిపాళను గతేడాది పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం సామ్ కూడా.. దర్శకుడు రాజ్ నిడిమోరుతో ప్రేమలో ఉన్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఇకపోతే.. సమంత చివరగా శుభం చిత్రంలో కనిపించింది. ఈ సినిమాతోనే తను నిర్మాతగా మారింది. ప్రస్తుతం రక్త బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్ వెబ్‌సిరీస్‌తో పాటు మా ఇంటి బంగారం సినిమా చేస్తోంది.

# రూ.200 కోట్ల కలెక్షన్స్‌తో దూసుకెళ్తున్న 'సైయారా'.. ఖాన్స్ రికార్డ్స్ బద్దలు

**బాలీవుడ్ మొత్తం ఇప్పుడు సైయారా జపం చేస్తోంది. ఎక్కడ చూసినా ఈ చిన్న సినిమా గురించే చర్చిస్తున్నారు. విడుదలై వారం రోజులు దాటినా.. జనాలు ఈ సినిమాను మర్చిపోవడం లేదు. బాక్సాఫీస్ కలెక్షన్స్ రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. వారం రోజుల్లో ఈ చిత్రం రూ. 200 కోట్లకు పైగా వసూళ్లను సాధించి.. బడా హీరోల పేరిట ఉన్న రికార్డులను కొల్లగొడుతోంది.**

అహన్ పాండే, అనీత్ పడ్డా హీరోహీరోయిన్లు నటించిన ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించాడు. ఈ నెల 18న ఎలాంటి అంచనాలు లేకుండా కేవలం 800 థియేటర్స్‌లో మాత్రమే విడుదలైంది. తొలి రోజే బ్లాక్ బస్టర్ హిట్ టాక్ సంపాదించుకుంది. ఫలితంగా రెండో రోజు నుంచి ఈ సినిమా వసూళ్లు పుంజుకున్నాయి. ఎనిమిది రోజుల్లో రూ. 200 కోట్ల వరకు వసూళ్లను సాధించింది.

ఇటీవల బాలీవుడ్‌లో విడుదలైన అన్ని చిత్రాల్లో ఇదే అత్యధిక కలెక్షన్స్. ఖాన్ సినిమాలు సైతం ఈ స్థాయిలో కలెక్షన్స్‌ని రాబట్టడం లేదు.

ఆమిర్ ఖాన్ 'సితారే జమీన్ పర్ (164 కోట్లు), అజయ్ దేవ్‌గన్ రైడ్ 2 (173 కోట్ల) చిత్రాలకు మించిన కలెక్షన్స్‌ని రాబట్టి.. అత్యధిక వసూళ్ల సాధించిన డెబ్యూ ఫిల్మ్‌గా రికార్డెకెక్కింది. సినిమాకు హిట్ టాక్ రావడంతో థియేటర్స్ సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 2000 థియేటర్స్‌లో ఈ సినిమా ప్రదర్శితం అవుతోంది.

సైయారా కథ విషయానికొస్తే..వాణి బత్రా(అనీత్ పడ్డా) ఓ రైటర్. కాలేజీలో తన సీనియర్ అయిన మహేశ్ అయ్యర్‌ని ప్రేమించి, ఇంట్లో వాళ్లకి చెప్పి పెళ్లికి కూడా ఒప్పిస్తుంది. కానీ చివరి నిమిషంలో అతను హ్యాండ్ ఇస్తాడు. ఆరు నెలల వరకు వాణి ఆ డిప్రెషన్‌లోనే ఉంటుంది. తర్వాత ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరుతుంది. అదే రోజు ఆమె జీవితంలోకి క్రిష్ కపూర్ (అహన్ పాండే) వస్తాడు. తానో సింగర్. అవకాశాల కోసం తిరుగుతుంటారు. వాణితో కలిసి ఓ పాట కోసం పని చేస్తారు. ఈ క్రమంలో ఇద్దరు ప్రేమలో పడిపోతారు. అదే సమయంలో వాణి జీవితంలోకి మళ్లీ మహేశ్ అయ్యర్ వస్తాడు. ఆ తర్వాత ఏం జరిగింది. ఈ ఇద్దరిలో వాణి ఎవరికి దగ్గరైంది అనేదే మిగతా కథ.








# గుర్తుపట్టలేనంతగా మారిపోయిన హీరోయిన్.. ఇప్పుడేం చేస్తుందంటే?

పైన కనిపిస్తున్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా? అప్పట్లో ఓ వెలుగు వెలిగింది. తెలుగులోనే కాదు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ సినిమాలు చేసింది. కోలీవుడ్‌లో అగ్ర కథానాయికగా స్టార్‌డమ్ అందుకుంది. కానీ, అందరిలాగే పెళ్లి కాగానే నటనకు గుడ్‌బై చెప్పి ఇంటికే పరిమితమైంది. 2009 తర్వాత మరే చిత్రంలోనూ కనిపించనేలేదు. ఇంతకీ ఆ కథానాయిక మరెవరో కాదు మాళవిక .

**పెళ్లయ్యాక సినిమాలకు గుడ్‌బై**

మాళవిక అసలు పేరు శ్వేత కొన్నూర్ మీనన్. చాలా బాగుంది చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. దీవించండి, శుభకార్యం, నవ్వుతూ బతకాలిరా, ప్రియ నేస్తమా, అప్పారావు డ్రైవింగ్ స్కూల్, చంద్రముఖి చిత్రాల్లో నటించింది. తమిళంలో స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా నటించి ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. బోల్డ్ పాత్రల్లోనూ కాదనకుండా యాక్ట్ చేసింది. 2007లో సుమేశ్ మీనన్‌ను పెళ్లి చేసుకుని సినిమాలకు దూరమైంది. ఆమధ్య రీఎంట్రీకి రెడీ అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఇలా అయిపోయిందేంటి?**

పుష్పలో సమంతలా 'ఊ అంటావా మావా.. ఉఊ అంటావా మావా..' వంటి ఐటం సాంగ్స్ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పింది. కానీ ఇంతవరకు ఏ సినిమాలోనూ కనిపించనేలేదు. అప్పట్లో నాజూకుగా ఉన్న మాళవిక ప్రస్తుతం కాస్త బొద్దుగా తయారైంది. యోగాతో శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటున్న ఈమె.. ఇంతలా లావైపోవడంతో అభిమానులు వెంటనే గుర్తుపట్టలేకపోతున్నారు. మాళవిక ఇలా అయిపోయిందేంటని ఆశ్చర్యపోతున్నారు.

# 'అతడు' పార్ట్2 ఎవరితో తీస్తారు? మురళీ మోహన్ ఏం చెప్పారంటే!

**కొన్ని సినిమాలు ఎన్నిసార్లు చూసినా మరోసారి చూడాలనిపిస్తాయి. అలాంటి వాటిల్లో మహేశ్ బాబు హీరోగా వచ్చిన 'అతడు' ఒకటి. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలోని కామెడీ, పాటలు, డైలాగులు ఇప్పటికీ సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. 2005లో విడుదలైన ఈ సినిమాను మురళీ మోహన్ నిర్మించారు. ఆగస్టు 9న దీన్ని రీ-రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మురళీ మోహన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇప్పటి టెక్నాలజీకు తగినట్లు ఇందులో మార్పులు చేసినట్లు తెలిపారు.**




''నాకు ఇతర వ్యాపారాలు ఉండడం, రాజకీయాల్లో బిజీగా ఉండడంతో 'అతడు' తర్వాత మరో సినిమాను నిర్మించలేకపోయాం. త్వరలోనే జయభేరి బ్యానర్‌పై మళ్లీ సినిమాలు తీస్తాం. దీన్ని రీరిలీజ్ చేయాలని రెండేళ్ల నుంచి ఎంతోమంది అడిగారు. ఆ రోజుల్లో ఈ చిత్రాన్ని బిగ్‌స్క్రీన్‌పై ఎక్కువమంది చూడలేదు. టీవీల్లో చూసి చాలా బాగుందన్నారు. అలాంటి వారందరూ ఇప్పుడు థియేటర్‌లలో చూసి ఎంజాయ్ చేస్తారని నాకు నమ్మకం ఉంది'' అన్నారు.

**థియేటర్‌లో కంటే శాటిలైట్ రైట్స్ ద్వారానే లాభాలు తెచ్చింది. మీకెలా అనిపించింది?**

మురళీ మోహన్: ఈ సినిమా వల్ల మాకు ఒక్క రూపాయి కూడా లాస్ లేదు. దీన్ని చూశాక సెన్సార్ బోర్డులోని ఒక సభ్యుడు నాకు ఫోన్ చేసి ప్రత్యేకంగా మాట్లాడాడు. అద్భుతంగా ఉందన్నాడు.

**'అతడు'లో మీరెందుకు నటించలేదు?**

మురళీ మోహన్: నాకు పాత్ర ఇవ్వలేదు. నేను ఇండస్ట్రీకి రావాలనుకున్నప్పుడు మా ఆవిడ నాకో కండీషన్ పెట్టింది. ఎవరి దగ్గరకు వెళ్లి పాత్ర అడగ కూడదు అని చెప్పింది. దాన్ని నేను ఇప్పటికీ పాటిస్తున్నా. అందుకే ఈ సినిమాలో పాత్ర ఇవ్వకపోయినా అడగలేదు.

**'అతడు' పార్ట్2 తీస్తే ఎవరితో తీస్తారు?**

మురళీ మోహన్: ఒకవేళ దీని పార్ట్2 తీస్తే.. త్రివిక్రమ్ దర్శకత్వంలోనే మహేశ్ హీరోగానే తీస్తా. వాళ్లను మారిస్తే జనం అంగీకరించరు. వాళ్లు డేట్స్ ఇస్తే కచ్చితంగా తీస్తా.

**దీని కోసం తీసుకున్న రెమ్యునరేషన్ మహేశ్, త్రివిక్రమ్ తిరిగి ఇచ్చేశారని వార్తలు వచ్చాయి. నిజమేనా?**

మురళీ మోహన్: అంత అవసరం రాలేదండి. దీని వల్ల ఎవరూ నష్టపోలేదు.

**రీ-రిలీజ్‌లపై మీ అభిప్రాయం ఏంటి?**

మురళీ మోహన్: గతంలో కంటే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మొదటి మూడురోజుల్లో ఎంత వసూళ్లు చేస్తే అదే కలెక్షన్. నాలుగు వారాల్లోనే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. థియేటర్‌లలో సినిమా చూడకపోవడానికి కూడా కారణం ఉంది. హాలులో పార్కింగ్ ఖర్చు నుంచి పాప్‌కార్న్ వరకూ ప్రతిదీ మధ్యతరగతి వాళ్లకు భారంగానే ఉంటుంది. టికెట్ ధరల కంటే అవే ఎక్కువగా ఉంటున్నాయి.

**నాజర్ పాత్రకోసం 'శోభన్ బాబు'కు బ్లాంక్ చెక్ ఇచ్చారట నిజమేనా?**

మురళీ మోహన్: మా బ్యానర్‌లో శోభన్ బాబు 'ముగ్గురు మిత్రులు' సినిమాలో నటించారు. అది పెద్ద హిట్. దాని తర్వాత ఆయన సినిమాల్లో నటించడం తగ్గించేశారు. ఈ సినిమాలో నాజర్ పాత్ర కోసం ఆయన్ని సంప్రదించాం. మా మేనేజర్‌కు బ్లాంక్ చెక్ ఇచ్చి శోభన్ బాబు ఇంటికి పంపించాం. రెమ్యునరేషన్ ఎంతైనా ఫర్వాలేదని చెప్పాం. కానీ, ఆయన అంగీకరించలేదు. 'నేను ప్రేక్షకులకు ఎప్పటికీ హీరోగానే గుర్తుండాలి. తండ్రి, తాత పాత్రల్లో గుర్తుపెట్టుకోవడం నాకు ఇష్టం లేదు' అని చెప్పారు.



# నగాల్ పునరాగమనం

**స్విట్జర్లాండ్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌లో పాల్గొనే భారత జట్టు ఎంపిక**

**న్యూఢిల్లీ:** కేంద్రం నుంచి నిధులు పొందుతూ... జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు విముఖత చూపితే... వారికి నిధులు నిలిపివే స్తామని ఇటీవల కేంద్ర క్రీడా శాఖ జారీ చేసిన హెచ్చరికలు ఫలితాన్నిచ్చాయి. డేవిస్ కప్ టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించేందుకు సింగిల్స్ స్టార్ సుమిత్ నగాల్... డబుల్స్ స్పెషలిస్ట్ యూకీ బాంబ్రీ మళ్లీ ముందు కొచ్చారు. ఈ ఏడాది సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు స్విట్జర్లాండ్‌తో బీల్ నగరంలో జరిగే డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 మ్యాచ్‌లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. సింగిల్స్‌లో సుమిత్ నగాల్, కరణ్ సింగ్, ఆర్యన్ షా... డబుల్స్‌లో యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ ఎంపికయ్యారు. హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ, శశికుమార్ ముకుంద్, దక్షిణేశ్వర్ సురేశ్ రిజర్వ్ ఆటగాళ్లుగా ఉన్నారు. ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 306వ స్థానంలో ఉన్న సుమిత్ నగాల్ చివరి సారి 2023లో డేవిస్‌కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

ఆ తర్వాత పాకిస్తాన్, స్వీడన్, టోగో జట్లతో జరిగిన మ్యాచ్‌లకు సుమిత్ దూరంగా ఉన్నాడు. ప్రపంచ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో 35వ స్థానంలో ఉన్న యూకీ బాంబ్రీ గత ఏడాది ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో ఆడిన తర్వాత స్వీడన్, టోగో జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో పాల్గొనలేదు.



# ప్రపంచ బాక్సింగ్ పోటీలకు నిఖత్

సెప్టెంబర్ లో ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. తెలంగాణ స్టార్, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ భారత జట్టులో చోటు దక్కించుకున్నారు.

పాటియాలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఐఎస్)లో వారం రోజులపాటు నిర్వహించిన శిబిరం తర్వాత భారత జట్లను ఎంపిక చేశారు. కొత్తగా ఏర్పడ్డ వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 నుంచి 14 వరకు ఈ మెగా టోర్నీ జరగనుంది. పురుషుల, మహిళల విభాగాల్లో 10 వెయిట్ కేటగిరీల్లో బౌట్‌లు ఉంటాయి.

భారత మహిళల బాక్సింగ్ జట్టు: మీనాక్షి హుడా (48 కేజీలు), నిఖత్ జరీన్ (51 కేజీలు), సాక్షి (54 కేజీలు), జైస్మిన్ లంబోరియా (57 కేజీలు, సంజూ ఖత్రి (60 కేజీలు), నీరజ్ ఫొగాట్ (65 కేజీలు), సనమచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), పూజా రాణి (80 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 80 కేజీలు).

భారత పురుషుల బాక్సింగ్ జట్టు: జాదుమణి సింగ్ (50 కేజీలు), పవన్ బర్త్‌వాల్ (55 కేజీలు), సచిన్ సివాచ్ జూనియర్ (60 కేజీలు), అభినాశ్ జమ్వాల్ (65 కేజీలు), హితేశ్ గులియా (70 కేజీలు), సుమిత్ కుందు (75 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ అహ్లావత్ (85 కేజీలు), హర్ష్ చౌధరీ (90 కేజీలు), నరేందర్ బెర్వాల్ (ప్లస్ 90 కేజీలు).



# ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్..
# డ్రాగా ముగిసిన తొలి గేమ్

**బాటుమి:** ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ ఆసక్తికరంగా మొదలైంది. తెలుగమ్మాయి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్‌లో తొలి గేమ్ డ్రాగా ముగిసింది. దివ్య తెల్లపావులతో ఆడగా.. హంపి నల్లపావులతో ఆడింది. రేపు (ఆదివారం) రెండో గేమ్ నిర్వహిస్తారు. అది కూడా డ్రా అయితే.. సోమవారం టై బ్రేక్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు



# పోరాడుతున్న భారత్.. నాలుగో రోజు ముగిసిన ఆట





**మాంచెస్టర్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగు టెస్టును డ్రా చేసుకునేందుకు టీమ్ఇండియా పోరాడుతోంది. 544/7తో నాలుగో రోజు, శనివారం ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన టీమ్ఇండియాకు ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. యశస్వి జైస్వాల్ (0), సాయి సుదర్శన్ (0)ను తొలి ఓవర్‌లోనే క్రిస్ వోక్స్ వరుస బంతుల్లో పెవిలియన్‌కు పంపాడు. అప్పటికి భారత్ పరుగుల ఖాతా కూడా తెరవలేదు. దీంతో భారత్ వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలుతుందేమోనని అభిమానులు కంగారుపడ్డారు.

కానీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (78 బ్యాటింగ్; 167 బంతుల్లో 10 ఫోర్లు), కేఎల్ రాహుల్ (87 బ్యాటింగ్; 210 బంతుల్లో 8 ఫోర్లు) ఆదుకోవడంతో టీమ్ఇండియా కోలుకుంది. ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. భారత్ ఇంకా 137 పరుగుల వెనుకంజలో ఉంది. తొలుత గిల్ దూకుడుగా ఆడాడు. 77 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్న అతను తర్వాత జోరు తగ్గించాడు. అయితే, మరో ఎండ్‌లో ఉన్న రాహుల్ ఆరంభంలో ఎక్కువగా సింగిల్స్ తీశాడు. అతను 141 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. హాఫ్ సెంచరీ తర్వాత ఐదు ఫోర్లు బాదాడు. చివరి రోజూ కూడా మన బ్యాటర్లు పోరాటం కొనసాగిస్తే భారత్ ఓటమిని తప్పించుకోవచ్చు.

నాలుగో రోజు ఆటలో ఇంగ్లాండ్ మరో 125 రన్స్ చేసి మిగతా మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలోనే 311 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. 77 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో క్రీజులోకి వచ్చిన బెన్ స్టోక్స్ (141; 198 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం చేశాడు. బ్రైడన్ కార్స్ (47; 54 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. లియామ్ డాసన్ (26) పరుగులు చేశాడు. జో రూట్ (150; 248 బంతుల్లో 14 ఫోర్లు) శతకం చేయగా.. ఓపెనర్లు జాక్ క్రాలీ (84; 113 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్), బెన్ డకెట్ (94; 100 బంతుల్లో 13 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ ఓలీ పోప్ (71; 128 బంతుల్లో 7 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, జస్‌ప్రీత్ బుమ్రా 2, వాషింగ్టన్ సుందర్ 2, అంశుల్ కాంబోజ్, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు.




# యూఏఈ వేదికగా ఆసియా కప్ 2025..
# భారత్, పాక్ మ్యాచ్ ఎప్పుడంటే?

**ఎట్టకేలకు ఆసియా కప్ నిర్వహణపై సందిగ్ధత వీడింది. భారత్‌కే ఆతిథ్య హక్కులు ఉన్నప్పటికీ.. తటస్థ వేదికగా టోర్నీ జరగనుంది. యూఏఈలో సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ జరగనుంది. ఈ విషయాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మోసిన్ నక్వీ ధ్రువీకరించాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. జులై 24న ఢాకాలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోగా, తాజాగా వెల్లడించారు. ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది దేశాలు పాల్గొననున్నాయి. మొత్తం 19 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అయితే, వేదికలు ఇంకా ఖరారు కాలేదు. గ్రూప్ ఏలో భారత్, పాకిస్థాన్, యూఏఈ, ఒమన్.. గ్రూప్ బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హంకాంగ్ ఉన్నాయి.**

**సెప్టెంబరు 14న భారత్ పాకిస్థాన్ మ్యాచ్**

చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబరు 14న జరగనుంది. ప్రతి గ్రూప్ నుంచి రెండు టీమ్‌లు సూపర్ 4కు అర్హత సాధిస్తాయి. సూపర్ 4లో ప్రతి జట్టు మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్ 2లోని నిలిచిన జట్ల మధ్య ఫైనల్ నిర్వహిస్తారు. ఈ లెక్కన భారత్, పాకిస్థాన్ మూడుసార్లు తలపడేందుకు అవకాశం ఉంది. గ్రూప్ స్టేజీలో ఎలాగూ ఒక మ్యాచ్ ఆడతాయి. ఇక, సూపర్ 4లోనూ మరోసారి ఢీకొనే ఛాన్స్ ఉంది. సూపర్ 4లో దాయాది దేశాలు టాప్ 2లో ఉంటే ఫైనల్‌లోనూ తలపడతాయి.

**ఆసియా కప్ షెడ్యూల్ గ్రూప్ స్టేజ్**

- 9 సెప్టెంబర్: అఫ్గానిస్థాన్ - హాంకాంగ్
- 10 సెప్టెంబర్: భారత్ - యూఏఈ
- 11 సెప్టెంబర్: బంగ్లాదేశ్ - హాంకాంగ్
- 12 సెప్టెంబర్: పాకిస్థాన్ - ఒమన్
- 13 సెప్టెంబర్: బంగ్లాదేశ్ - శ్రీలంక
- 14 సెప్టెంబర్: భారత్ - పాకిస్థాన్
- 15 సెప్టెంబర్: శ్రీలంక - హాంకాంగ్
- 16 సెప్టెంబర్: బంగ్లాదేశ్ - అఫ్గానిస్థాన్
- 17 సెప్టెంబర్: పాకిస్థాన్ - యూఏఈ
- 18 సెప్టెంబర్: శ్రీలంక - అఫ్గానిస్థాన్
- 19 సెప్టెంబర్: భారత్ - ఒమన్

**సూపర్ 4**

- 20 సెప్టెంబర్: గ్రూప్ బి క్వాలిఫయర్ 1 - గ్రూప్ బి క్వాలిఫయర్ 2
- 21 సెప్టెంబర్: గ్రూప్ ఏ క్వాలిఫయర్ 1 - గ్రూప్ ఏ క్వాలిఫయర్ 2
- 23 సెప్టెంబర్: గ్రూప్ ఏ క్వాలిఫయర్ 1 - గ్రూప్ బి క్వాలిఫయర్ 2
- 24 సెప్టెంబర్: గ్రూప్ బి క్వాలిఫయర్ 1 - గ్రూప్ ఏ క్వాలిఫయర్ 2
- 25 సెప్టెంబర్: గ్రూప్ ఏ క్వాలిఫయర్ 2 - గ్రూప్ బి క్వాలిఫయర్ 2
- 26 సెప్టెంబర్: గ్రూప్ ఏ క్వాలిఫయర్ 1 - గ్రూప్ బి క్వాలిఫయర్ 1

**ఫైనల్**

28 సెప్టెంబర్ : ఫైనల్ మ్యాచ్

# ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో..
# ఒకేఒక్కడు స్టోక్స్



మాంచెస్టర్ వేదికగా ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య తెండుల్కర్ అండర్సన్ ట్రోఫీలో భాగంగా నాలుగో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ అటు బంతితోనూ, ఇటు బ్యాట్‌తోనూ దుమ్మురేపాడు. ఓ భారీ రికార్డ్‌ను తన సొంతం చేసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 24 ఓవర్లపాటు బౌలింగ్ చేసిన బెన్‌స్టోక్స్ 72 పరుగులిచ్చి అయిదు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే బ్యాటింగ్‌లోనూ (198 బంతుల్లో 141 పరుగులు) రాణించాడు. ఈ టెస్ట్ మ్యాచ్‌లో అయిదు వికెట్ల ప్రదర్శన చేయడంతో పాటు, సెంచరీ సైతం సాధించాడు. 148 సంవత్సరాల ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన తొలి ఇంగ్లిష్ కెప్టెన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు మొత్తంగా 82 మంది ఇంగ్లాండ్‌కు టెస్ట్ కెప్టెన్లుగా వ్యవహరిస్తే ఈ ఘనత సాధించింది మాత్రం బెన్‌స్టోక్స్ ఒక్కడే కావడం విశేషం.

**ఓవరాల్‌గా అయిదో కెప్టెన్**

ఓవరాల్‌గా మాత్రం బెన్‌స్టోక్స్ అయిదో కెప్టెన్‌గా నిలిచాడు. అంతకు ముందు వెస్టిండీస్‌కు చెందిన డెన్నీస్ అట్కిన్సన్ (ఆస్ట్రేలియాపై, 1955), గ్యారీ సోబర్స్ (ఇంగ్లాండ్‌పై, 1966), పాకిస్థాన్‌కు చెందిన ముస్తాక్ మహమ్మద్ (వెస్టిండీస్‌పై, 1977), ఇమ్రాన్ ఖాన్ (భారత్‌పై, 1983) ఈ ఘనత సాధించారు.

**నాలుగో ఇంగ్లాండ్ బ్యాటర్..**

అలాగే ఒకే మ్యాచ్‌లో అయిదు వికెట్లు, సెంచరీ చేసిన ఇంగ్లిష్ బ్యాటర్ల జాబితాలో స్టోక్స్ నాలుగో క్రికెటర్‌గా నిలిచాడు. బెన్‌స్టోక్స్ కన్నా ముందు టోనీ జార్జి, ఇయాన్ బోథమ్, గస్ అట్కిన్‌సన్ ఉన్నారు. ఓవరాల్‌గా స్టోక్స్ ఈ రికార్డ్ సాధించిన ఏడో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. అతడి కంటే ముందు కోలీ స్మిత్, గ్యారీ సోబర్స్, బ్రూస్ టైలర్, ఇయాన్ బోథమ్, ఇమ్రాన్ ఖాన్, రోస్టన్ చేస్ ఉన్నారు.

**మూడో క్రికెటర్‌గా..**

అలాగే టెస్ట్ క్రికెట్‌లో 7,000 పరుగులు సాధించి 200 వికెట్లు తీసిన మూడో క్రికెటర్‌గానూ స్టోక్స్ నిలిచాడు. అతడి కంటే ముందు ఈ జాబితాలో గ్యారీ సోబర్స్, జాక్వెస్ కలీస్ ఉన్నారు. మొత్తానికి బెన్‌స్టోక్స్ వరల్డ్ క్లాస్ ఆల్‌రౌండర్‌గా తన సత్తా చాటుతున్నాడు. ఈ మ్యాచ్‌లో జోరూట్ (150) కూడా భారీ శతకం సాధించాడు. ప్రస్తుతం అతడు టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా అవతరించాడు.

**చెత్త రికార్డు సొంతం చేసుకున్న జస్‌ప్రీత్ బుమ్రా**

ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లపాటు బౌలింగ్ వేసిన అతడు రెండు వికెట్లు కూల్చి ఏకంగా 112 పరుగులిచ్చాడు. అయిదు ఓవర్లు మాత్రం మెయిడిన్ చేయగలిగాడు. అయితే ఇప్పటి వరకు బుమ్రా తన టెస్ట్ కెరీర్‌లో ఒక ఇన్నింగ్స్‌లో 100పైచిలుకు పరుగులు సమర్పించుకోవడం మాత్రం ఇదే ప్రథమం.